సాక్షి విశాఖపట్నం

గురువారం। 24। ఆగస్టు। 2023

న్యూస్‌రీల్

25న సీఎం ట్రాన్సిట్ హాల్ట్



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 25న విశాఖపట్నం రానున్నారు. ఆయన గన్నవరం నుంచి బయలుదేరి ఉదయం 9.45 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఇక్కడ 9.50 గంటలకు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతారు. అనంతరం హెలికాప్టర్‌లో విజయనగరం జిల్లాకు చేరుకుని.. అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. తిరిగి అక్కడ నుంచి 1.30 గంటలకు విశాఖ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2.30 గంటల వరకు వీఐపీ లాంజ్‌లో విశ్రాంతి తీసుకుంటారు. 2.40 గంటలకు ఇక్కడి నుంచి గన్నవరం బయలుదేరుతారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అలపాటి గిరిధర్

విశాఖ లీగల్ : లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం జరిగి, సత్వర న్యాయం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అలపాటి గిరిధర్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కాన్ఫరెన్సు హాలులో కోఆర్డినేషన్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా అన్ని కోర్టుల్లో అన్ని రకాల కేసులు పెద్ద సంఖ్యలో రాజీ చేయాలన్నారు. కార్యక్రమంలో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎస్.శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ, బార్ ప్రెసిడెంట్ చింతపల్లి రాంబాబు, బార్ కౌన్సిల్ ప్రతినిధులు బైపా అరుణ్ కుమార్, అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ న్యాయమూర్తులు, న్యాయవాదులు, రెవెన్యూ అధికారులు, ఇన్సూరెన్సు కంపెనీ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సర్వే వివరాలు యాప్‌లో నమోదు చేయాలి



పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి

మహారాణిపేట: ఇంటింటా ఓటరు సర్వే వివరాలు ఎప్పటికప్పుడు బూత్ లెవెల్ స్థాయి అధికారి బీఎల్‌వో యాప్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. అందుకు అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి సహకరించాలన్నారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో గల ఈఆర్‌వోలు, ఎఈఆర్‌వోలు, సచివాలయ బీఎల్‌వోలతో ఇంటింటికి ఓటరు సర్వే ప్రగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని, అందుకు బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాస మూర్తి, ఎన్నికల పర్యవేక్షకుడు రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో 27 నుంచి విద్యార్థులకు పోటీలు



కొమ్మాది: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ టెంపుల్‌లో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 27 నుంచి వ్యాసరచన, చిత్రలేఖనం, కృష్ణ లీలలపై పరీక్ష, భగవద్గీత శ్లోక పారాయణం, వంటలు, పూల అలంకరణ, రంగోలి తదితర పోటీలు ప్రారంభమవుతాయన్నారు. వచ్చే నెల 6 నుంచి 8వ తేదీ వరకు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు 94417 92704, 63059 52060, 99455 04309 నంబర్లలో సంప్రదించవచ్చు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

దాబాగార్డెన్స్: డెంగ్యూ జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్టు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. మేయర్‌ను మీడియా కలిసిన సందర్భంలో ఆమె మాట్లాడుతూ జ్వరాల నియంత్రణకు ప్రత్యేకంగా సిబ్బందిని తీసుకోనున్నట్టు చెప్పారు. వీరు ప్రతి ఇంటికి వెళ్లి దోమల నివారణకు చర్యలు చేపట్టనున్నారని పేర్కొన్నారు.

జాబిల్లిపై కీర్తి పతాక



- చంద్రయాన్-3 సక్సెస్‌తో జిల్లా వ్యాప్తంగా సంబరాలు
- పాఠశాలల్లో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించిన విద్యార్థులు



ఏయూలో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు, ఆచార్యులు

ఏయూక్యాంపస్: భారతదేశ సాంకేతిక, పరిశోధన ప్రగతికి చిహ్నంగా చంద్రయాన్-3 నిలుస్తుందని ఏయూ ఆచార్యులు అన్నారు. జాబిల్లిపై విక్రమ్ ల్యాండింగ్ ప్రక్రియను బుధవారం ఏయూ భౌతిక శాస్త్ర విభాగ సమావేశ మందిరంలో విద్యార్థులతో కలిసి ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు. విక్రమ్ చంద్రుడిపై దిగగానే విద్యార్థులు పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. చప్పట్లతో తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఇస్రో శాస్త్రవేత్తల బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రయాన్-3 విజయ సంబరాల్లో విశాఖ ప్రజలు మునిగితేలారు. వినువీధిలో భారత కీర్తి పతాకను రెపరెపలాడించి.. 140 కోట్ల భారతీయుల కలను నిజం చేసిన ఇస్రో సాహో అంటూ నినదించారు. భారత వైజ్ఞానిక సత్తాను మన శాస్త్రవేత్తలు ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. సైకిల్‌పై రాకెట్ విడి భాగాలు మోసుకెళ్లిన రోజు నుంచి విక్రమ్ ల్యాండర్‌ను జాబిల్లిపై విజయవంతగా దింపిన క్షణం వరకు ఇస్రో ప్రయాణం అద్భుతమని కొనియాడారు.

ఆల్ ద బెస్ట్ ఇస్రో



చంద్రయాన్-3 విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సాలగ్రామపురంలోని భారతీయ విద్యా భవన్ చిన్నారులు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. జాతీయ జెండాలను చేతబూని ఇస్రోకు ఆల్ ద బెస్ట్ చెప్పారు.



గాజువాక హైస్కూల్‌లో చంద్రయాన్-3కి విద్యార్థుల అభినందన



అడవివరం జెడ్పీ హైస్కూల్‌లో చంద్రయాన్ రూపంలో కూర్చొని విద్యార్థుల ప్రదర్శన

అభివృద్ధి చెందిన దేశంగా భారత్



చంద్రయాన్-3 విజయం సాధించడం వల్ల భారత్ అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలుస్తుంది. దేశీయంగా తయారు చేసిన పరికరాలతో జరిగిన ప్రయోగం ఇది. భారత దేశ సామర్థ్యాలు నేడు ప్రపంచానికి తెలిశాయి. స్పేస్ టెక్నాలజీలో అవకాశాలు విస్తృతం అవుతాయి.

– డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, విభాగాధిపతి

దేశానికి గర్వకారణం



చంద్రయాన్ ప్రయోగం విజయవంతం కావడం దేశానికి గర్వకారణం. అపజయాల నుంచి భారత్ అంతరిక్ష పరిశోధన సంస్థ విజయాలకు బాట వేసుకుంది. మరిన్ని ప్రయోగాలు జరగాలని కోరుకుంటున్నాను. ఈ ఆనందం మాటల్లో వర్ణించలేనిది.

– బి.సుష్మిత, విద్యార్థిని

కష్టతరమైన ప్రయోగం



దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్‌ను ఇస్రో విజయవంతంగా దింపింది. అక్కడ వాతావరణ పరిస్థితులు, జీవుల జాడ, నీటి వనరులు వంటివి తెలుస్తాయి. ఇటీవల రష్యా ప్రయోగం విఫలం కావడంతో కొంత ఒత్తిడికి గురయ్యాం. ఈ విజయం ఎంతో సంతోషాన్ని కలిగించింది.

– బి.సాయి కుమార్, విద్యార్థి

చందమామను చేతితో తాకినంత ఆనందం



చంద్రయాన్-3 విజయవంతం కావాలని కోరుకుంటూ 40 రోజులుగా ఆసక్తిగా ఎదురు చూశాం. అన్ని పనులూ పక్కన పెట్టి ఇంటిల్లిపాదీ టీవీ ముందు కూర్చున్నాం. చివరి 15 నిముషాలు ఉత్కంఠ. టీవీ స్క్రీన్ మీద టైం, ల్యాండర్‌కి చంద్రుడి ఉపరితలానికి మధ్య దూరం తగ్గడం ఊపిరి బిగపట్టి చూశాం. సేఫ్‌లీ ల్యాండెడ్ అన్న మాట వినగానే చందమామను స్వయంగా చేతితో తాకినంత ఆనందం కలిగింది. జై హింద్.. జై ఇస్రో..

– ఎస్.మణి, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్

ఎస్ఎస్టీఎల్ పాత్ర కూడా ఉంది



చంద్రయాన్-3 ప్రయోగంలో కీలక ఘట్టమైన విక్రమ్ ల్యాండింగ్ విజయవంతం కావడం.. భారతీయులంతా గర్వించదగిన విజయం. ఇది ఓటమి నుంచి వచ్చిన విజయం.. చాలా మందికి ఆదర్శం. చంద్రయాన్‌లో ఉపయోగించిన స్పేస్ రికవరీ మాడ్యూల్‌కు ఎస్ఎస్టీఎల్‌లో పరీక్షలు చేశాం. ఇందులో చాలా సంస్థలు పాలు పంచుకున్నాయి. చంద్రయాన్-2 ఓటమి తర్వాత అందుకు గల కారణాలను అన్వేషించారు. నాలుగేళ్లుగా పలు రకాలుగా ప్రయోగాలు చేశారు. దక్షిణ ధృవంపై ల్యాండింగ్ చేయడం చాలా క్లిష్టమైన ప్రక్రియ. దాన్ని ఇస్రో విజయవంతంగా పూర్తి చేసింది. ఈ విజయంలో ఎస్ఎస్టీఎల్ పాత్ర కొంత ఉంది. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు.

– పి.వి.ఎస్ గణేష్‌కుమార్, విశ్రాంత ఎస్ఎస్టీఎల్ అవుట్ స్టాండింగ్ శాస్త్రవేత్త

అత్యంత వేగంగా రాష్ట్రం అభివృద్ధి

- ప్రజలకు వాస్తవాలు చెప్పండి
- మీడియాతో ముఖాముఖిలో వై.వి.సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో మంత్రి అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు గురువులు, ఎమ్మెల్యే వాసుపల్లి, నాగిరెడ్డి, అదీప్‌రాజ్ తదితరులు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర అభివృద్ధిని వక్రీకరిస్తూ ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, వాస్తవాలను ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత మీడియాపై ఉందని వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. దేశంలోనే రాష్ట్రం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. నగరంలో ఓ హోటల్‌లో బుధవారం మీడియా ప్రతినిధులతో ఆయన ముఖాముఖీగా మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, వాస్తవాలను అవాస్తవాలుగా ఎలా చిత్రీకరిస్తున్నారో తెలుపుతూ ఓ డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. 'నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జరుగుతుంటే.. రాష్ట్రం దివాలా తీసిందని కొందరు రకరకాలుగా మాట్లాడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర జీడీపీ ఎంత? తలసరి ఆదాయం ఎంత? ఇప్పుడు రాష్ట్ర జీడీపీ ఎంత? తలసరి ఆదాయం ఎంత? బేరీజు వేసుకోవాల్సిన అవసరం ఉంది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎంత మంది పేదరికంలో ఉన్నారు? ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఎంత మంది ప్రజలు పేదరికంలో ఉన్నారు? ఈ విషయాలను మీడియా ప్రతినిధులు ఆలోచన చేసి ప్రజలు చెప్పాల్సిన అవసరం ఉంది' అని సుబ్బారెడ్డి అన్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో రాష్ట్రం రూ.13.5 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించిందన్నారు. రాష్ట్రంలో కొత్త ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేయడం ద్వారా సుమారు 13.63 లక్షల కొత్త ఉద్యోగావకాశాలను సృష్టించారన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రం వరసగా మూడేళ్లు మొదటి స్థానంలో నిలిచిందన్నారు. 2019 నుంచి ఏపీలో రిలయన్స్, అదానీ, టీసీఎస్, ఐటీసీ, జేఎస్‌డబ్ల్యూ తదితర సంస్థలు పెట్టుబడులు పెట్టి.. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఆసరాగా నిలిచాయని చెప్పారు. కోస్టల్ తీర ప్రాంతంలో సుమారు రూ.20వేల కోట్లతో నాలుగు మేజర్ పోర్టులు, ఐదు ఫిషింగ్ హార్బర్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అత్యుత్తమంగా రోడ్ల కనెక్టివిటీని పెంచామన్నారు.

న్యాయస్థానాలపై నమ్మకం ఉంది

సమావేశం అనంతరం సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ రుషికొండపై అక్రమ నిర్మాణాలు చేపడితే న్యాయస్థానం వదిలేస్తుందా? ప్రభుత్వ భవనాలను పర్యావరణహితంగానే నిర్మిస్తున్నామని తెలిపారు. గీతం యూనివర్సిటీలో అక్రమాలు ప్యాకేజీస్టార్ పవన్ కల్యాణ్‌కు, అతని దత్తతండ్రి చంద్రబాబుకు కనబడటం లేదా ప్రశ్నించారు. ప్రభుత్వం టూరిజం ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తోందన్నారు. సింహాచలం పంచ గ్రామాల భూ సమస్యపై ప్రత్యేక కమిటీ వేశామని.. ఈ అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందన్నారు. కోర్టులపై నమ్మకం ఉందని, త్వరలో ఈ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆనందపురంలోని తర్లువాడ కొండపై సర్వే నం.1లో 120 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేట్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం అతి తక్కువ ధరకు ధారాదత్తం చేస్తున్నారనే వ్యాఖ్యలను ఆయన కొట్టిపడేశారు. అటువంటి ప్రతిపాదనలు ఏమీ లేవని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తూ.. బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని సుబ్బారెడ్డి మండిపడ్డారు.

సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వాసుపల్లి గణేష్ కుమార్, విశాఖ ఉత్తర, తూర్పు సమన్వయ కర్తలు కె.కె.రాజు, అక్కరమాని విజయనిర్మల, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్, ద్రోణంరాజు శ్రీవత్సవ్, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నెలరోజుల్లో క్రూయిజ్ టెర్మినల్ ప్రాజెక్టు ప్రారంభిస్తాం

- రాష్ట్ర ప్రభుత్వ సహకారంతోనే పోర్టు అభివృద్ధి
- జీఎంఐఎస్-2023తో సముద్ర రవాణాలో మరిన్ని అవకాశాలు
- విశాఖ పోర్టు అథారిటీ ఛైర్మన్ డా.అంగముత్తు



మాట్లాడుతున్న పోర్టు చైర్మన్ డా.అంగముత్తు, ఏపీ మారీటైమ్ బోర్డు డిప్యూటీ సీఈవో రవీంద్రనాథ్‌రెడ్డి, పోర్టు డిప్యూటీ చైర్మన్ దూబే

సాక్షి, విశాఖపట్నం : అంతర్జాతీయ పర్యాటకుల్ని ఆకర్షించేలా విశాఖపట్నం పోర్టు కేంద్రంగా తూర్పు తీరంలో నిర్మించిన తొలి క్రూయిజ్ టెర్మినల్‌ను మరో నెల రోజుల్లో ప్రారంభించనున్నామని పోర్టు చైర్మన్ డా.అంగముత్తు ప్రకటించారు. అక్టోబర్‌లో న్యూఢిల్లీలో కేంద్ర పోర్టులు, నౌకాయాన, జలరవాణా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గ్లోబల్ మేరీటైమ్ ఇండియా సమ్మిట్-2023కు ఆహ్వానం పలుకుతూ విశాఖ పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో రోడ్‌షో పేరుతో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును ప్రారంభించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి గుడివాడ అమర్‌నాథ్.. రూ.16 వేల కోట్లతో ప్రభుత్వం నిర్మిస్తున్న కొత్త పోర్టుల వల్ల.. రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సదస్సు అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో పోర్టు చైర్మన్ డా.అంగముత్తు మాట్లాడుతూ జీఎంఐఎస్-2023 ద్వారా సముద్రయాన రంగం సుస్థిరత వైపు అడుగులు వేస్తుందని అభిప్రాయపడ్డారు. నౌకాయాన అభివృద్ధి, పురోగతికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఢిల్లీలో జరిగే సమ్మిట్‌లో ఏపీ ప్రభుత్వంతో పాటు నౌకాయాన రంగంలో ఉన్న పారిశ్రామికవేత్తలు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో ఆంధ్రప్రదేశ్‌తో పాటు విశాఖపట్నం అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పోర్టును మరింత సుస్థిర అభివృద్ధి చేయడంతో పాటు, సామర్థ్యాన్ని విస్తరింపజేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. స్టేక్ హోల్డర్స్, విశాఖ ప్రజల సహకారంతో... సులభతర వాణిజ్య అవకాశాలకు స్వర్గధామంగా పోర్టు అడుగులు వేస్తోందని వివరించారు. పర్యాటక రంగానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహకారం అందుతోందన్నారు. పోర్టులో నిర్మిస్తున్న క్రూయిజ్ టెర్మినల్ పనులు దాదాపు పూర్తయ్యాయనీ.. నెలరోజుల్లో ప్రారంభించనున్నామని తెలిపారు. ఏపీ మారీటైమ్ బోర్డు డిప్యూటీ సీఈవో లెఫ్టినెంట్ కమాండర్ బీఎం రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ పోర్టులకు అనుసంధానంగా పారిశ్రామిక అభివృద్ధి జరుగుతోందనీ... అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో ఆలోచించి.. ప్రస్తుతం రాష్ట్రంలో నిర్మిస్తున్న ప్రతి పోర్టుకు అనుబంధంగా 4 వేల ఎకరాల వరకూ ల్యాండ్ బ్యాంక్‌ని అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలు వినియోగించుకొంటూ ఔత్సాహిక పెట్టుబడిదారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే పాల్గొన్నారు.

జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం నేడు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం గురువారం జరగనుంది. మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుంది. 30 అంశాలపై సభ్యులు చర్చించనున్నారు. జోన్-3 పరిధి 19వ వార్డు లాసన్స్ బే పార్క్‌లో రూ.36.53 లక్షలతో బ్యాడ్మింటన్ కోర్టు, యోగా ఫ్లోరింగ్, ఓపెన్ స్టేజ్, జిమ్ బాటమ్ పేవర్ ఫ్లోరింగ్, నీటి సరఫరా మరమ్మతులు, జోన్-5 పరిధి 52వ వార్డు గౌరీనగర్‌లో నిర్మిస్తున్న శానిటరీ, సచివాలయ భవనంలో మిగిలిన పనులు చేపట్టేందుకు పరిపాలన పరమైన అనుమతి, జీవీఎంసీలో జూనియర్ అసిస్టెంట్లుగా ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న పలువురికి స్పెషల్ గ్రేడ్ పోస్ట్ స్కేల్ మంజూరు, జోన్-8లో 89 నుంచి 98వ వార్డుల వరకు పారిశుధ్య నిర్వహణకు అదనపు సిబ్బంది నియామకం తదితర అంశాలపై సభ్యులు చర్చించనున్నారు.

25 నుంచి ఎస్ఐ అభ్యర్థులకు దేహ దారుఢ్య పరీక్షలు



కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న రేంజ్ డీఐజీ హరికృష్ణ

ఆరిలోవ: స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ ఎస్ఐల నియామకాల్లో భాగంగా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షల కోసం విశాఖ రేంజ్ పోలీస్ ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కైలాసగిరిలోని ఏఆర్ పోలీస్ మైదానంలో ఈ నెల 25 నుంచి సెప్టెంబర్ 23 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ.. అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణతో కలసి బుధవారం మైదానాన్ని సందర్శించారు. పరీక్షల నిర్వహణ కోసం ఇప్పటివరకు జరిగిన ఏర్పాట్లను పరిశీలించారు. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ విశాఖ రేంజ్ పరిధిలో నిర్వహించిన రాత పరీక్షలో 17,374 మంది అభ్యర్థులు అర్హత సాధించారన్నారు. వారికి ఈ నెల 25 నుంచి శరీర దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఇందుకోసం తగిన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన 2,745 మంది మహిళా అభ్యర్థులకు ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 2 వరకు ప్రత్యేకంగా దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు మెటాలిక్, స్పైక్ షూస్ ధరించి రావద్దని సూచించారు.

ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం-ఏపీఎస్ఎస్‌డీసీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సంయుక్తంగా 60 రోజుల పాటు నిర్వహించే ఇండస్ట్రీ ఓరియంటేషన్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకి డిప్లమా, బీటెక్, ఎంటెక్ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేంద్రం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అక్టోబర్ 30వ తేదీ వరకు ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. కోర్సు ఫీజుగా రూ.10 వేలు చెల్లించాలన్నారు. మొత్తం 7 కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణ అందిస్తారు. వివరాలకు 98480820995, 9652690534 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.79 కోట్లు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి హుండీల ఆదాయం గడిచిన 16 రోజులకి కోటి 79 లక్షల 27 వేల 20 రూపాయలు వచ్చినట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహగిరిపై గల పిల్‌గ్రిమ్స్ భవనం (పీఏసీ)లో స్వామివారి హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. నగదుతోపాటు 79.980 గ్రాముల బంగారం, 10.100 కిలోల వెండి లభించినట్టు తెలిపారు. దేవస్థానం అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు లెక్కింపులో పాల్గొన్నారు.

పీఏసీ భవనంలోకి లెక్కింపు మార్పు

ఇప్పటి వరకు ఆలయ బేడా మండపంలో జరిగే హుండీ ఆదాయం లెక్కింపుని పీఏసీ భవనంలోకి మార్పు చేశారు. ఇక నుంచి భక్తులు తక్కువగా ఉండే మంగళవారం రోజుల్లో పీఏసీ భవనంలో హుండీల ఆదాయం లెక్కింపు చేపట్టనున్నారు. ఇందుకోసం భవనంలో అదనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉన్న ఎస్‌పీఎఫ్ సిబ్బందితోపాటు లెక్కింపు రోజుల్లో అదనంగా సిబ్బందిని నియమించనున్నారు. ఆలయ బేడా మండపంలో స్థలం సరిపడకపోవడంతో లెక్కింపునకు రెండేసి రోజులు పడుతోందని, ఒక్కరోజులోనే లెక్కింపు ముగిసేలా పీఏసీ బిల్డింగ్‌లోకి మార్పు చేశామని ఈవో తెలిపారు.

హుండీలో రూ.100 కోట్ల చెక్కు

సింహగిరిపై బుధవారం చేపట్టిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీల ఆదాయం లెక్కింపులో వంద కోట్ల రూపాయల అమౌంట్ రాసి ఉన్న చెక్కు ఒకటి వచ్చింది. దీంతో అధికారులు తొలుత ఆశ్చర్యపోయారు. ఆ తర్వాత సదరు చెక్కుని నిశితంగా పరిశీలిస్తే తేదీ లేకుండా... అమౌంట్ రాసేచోట దిద్దివేత కనిపించింది. చెక్కుపై బొడ్డేపల్లి రాధాకృష్ణ అని సంతకం ఉంది. దీంతో అధికారులు సంబంధిత బ్యాంక్ అధికారులతో అకౌంట్ నంబరు ఆధారంగా సంప్రదించగా ఖాతాలో రూ.17 ఉన్నట్లు తేలింది. ఆకతాయితనంగానో, మతిస్థిమితం సరిగ్గా లేకనో ఆ చెక్కు హుండీలో వేసినట్టు అధికారులు భావిస్తున్నారు.



అప్పన్న హుండీలో లభించిన చెక్కు

ముఖ్యమంత్రిని కలిసిన ఎంపీ ఎంవీవీ,జీవీ



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కలిసిన ఎంపీ ఎంవీవీ, ఆడిటర్ జీవీ

ఎంవీపీకాలనీ: విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జీ.వెంకటేశ్వరరావు బుధవారం తాడేపల్లిలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. విశాఖ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను, సమస్యలను వారు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. విశాఖకు అన్ని అంశాల్లోను ప్రాధాన్యమివ్వడంతో పాటు నగర అభివృద్ధికి పెద్దపీట వేయాలని కోరారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం : ఈస్టర్న్ రైల్వే, హౌరా డివిజన్, రాంపూర్ హట్ – చర్త స్టేషన్ల పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ, నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల నిమత్తం విశాఖపట్నం మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు.

- ఈ నెల 31న కన్యాకుమారిలో బయల్దేరే కన్యాకుమారి – డిబ్రూఘడ్ (22503) వివేక్ ఎక్స్‌ప్రెస్ అండుల్, హౌరా, కత్వ, బందేల్, అజిమన్ గంజ్, న్యూ ఫరక్కల మీదుగా నడుస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ రైలుకు హౌరా, బందేల్, నబద్వీప్ ధాం, కత్వ, అజింగంజ్, జంగిపూర్ రోడ్ స్టేషన్‌లలో అదనపు హాల్ట్‌లను కల్పిస్తున్నారు.
- డిబ్రూఘడ్‌లో ఈ నెల 27, సెప్టెంబరు 5న బయల్దేరే డిబ్రూఘడ్ – కన్యాకుమారి(22504) వివేక్ ఎక్స్‌ప్రెస్ వయా న్యూ ఫరక్క, అజీంగంజ్, కత్వ, బందేల్, హౌరా, అండుల్ మీదుగా నడుస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ రైలుకు జంగిపూర్‌రోడ్, అజీంగంజ్, కత్వ, నబద్వీప్ ధాం, బందేల్, హౌరా స్టేషన్లలో అదనపు హాల్ట్‌ను కల్పిస్తున్నారు.
- గౌహతిలో ఈ నె 31న బయల్దేరే గౌహతి – సికింద్రాబాద్ (12514) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వయా న్యూ ఫరక్క, అజీంగంజ్, కత్వ, బందేల్, హౌరా, అండుల్ మీదుగా నడుస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ రైలుకు జంగిపూర్‌రోడ్, అజీంగంజ్, కత్వ, నబద్వీప్ ధాం, బందేల్, హౌరా స్టేషన్లలో అదనపు హాల్ట్‌ను కల్పిస్తున్నారు.

లీగ్ టాపర్‌గా రైడర్స్

విశాఖ స్పోర్ట్స్: కోస్టల్ రైడర్స్ మరోసారి ప్లేఆఫ్‌కు చేరుకుంది. ఏపీఎల్ సీజన్–2 లీగ్ చివరి మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్‌పై విజయం సాధించి 16 పాయింట్లతో టాప్‌లో నిలిచింది. వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచిన కోస్టల్ రైడర్స్ లక్ష్య ఛేదనకే మొగ్గు చూపింది. బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ కింగ్స్ 18 ఓవర్లలో 131 పరుగులు చేసింది. వరుణుడు 13 ఓవర్ వద్ద అంతరాయం కలిగించగా.. అప్పటికి కింగ్స్ జట్టు ఏడు వికెట్లకు 98 పరుగులు చేసింది. కెప్టెన్ హనుమ విహారి డకౌట్‌గా వెనుదిరగ్గా.. మరో ఓపెనర్ వీరారెడ్డి 45 బంతుల్లో 78 పరుగులు సాధించాడు. చివర్లో కమరుద్దీన్(21 బంతుల్లో 23 పరుగులు)తో కలిసి స్కోర్‌ను ముందుకు నడిపాడు. తిరిగి ఆటను కొనసాగించగా కింగ్స్ తొమ్మిది వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేయగా.. మరోసారి వర్షం కారణంగా ఆటను నిలిపివేశారు. అబ్దుల్లా 4 వికెట్లు తీయగా స్టీఫెన్, మనోహర్ రెండేసి వికెట్లు పడగొట్టారు. దీంతో కోస్టల్ రైడర్స్‌కు డీఎల్ఎస్ పద్ధతిలో 17 ఓవర్లలో 124 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించారు. 14 ఓవర్లలోనే రెండు వికెట్లకు 127 పరుగులతో రైడర్స్ విజయం సాధించారు. ఓపెనర్ ధరణీకుమార్(18), కెప్టెన్ రషీద్(4) వికెట్లను 65 పరుగులకే రైడర్స్ కోల్పోయింది. మరో ఓపెనర్ ప్రణీత్ 64, చిరంజీవి 32 పరుగులతో అజేయంగా నిలిచి జట్టుకు విజయాన్నందించారు. కమరుద్దీన్, హనుమ విహారి చెరో వికెట్ తీశారు.



చెలరేగిన రైడర్ చిరంజీవి

చేతులెత్తేసిన టైటాన్స్

తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో గోదావరి టైటాన్స్ చేతులెత్తేసింది. రెండో మ్యాచ్‌లో టైటాన్స్ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు కెప్టెన్ జ్ఞానేశ్వర్(2), హేమంత్(1) ఎనిమిది పరుగులకే పెవిలియన్‌కు చేరారు. శ్యామ్ 11, సమన్విత్ 14, సత్యనారాయణ 16 పరుగులు చేశారు. మిగిలిన వారంతా సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు. మరో బంతి ఉండగానే టైటాన్స్ 77 పరుగులకే ఆలౌటైంది. పృథ్వీ, తేజస్వి మూడేసి వికెట్లు తీయగా అయ్యప్ప రెండు, అజయ్, వాసు ఒక్కో వికెట్ పడగొట్టారు. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఉత్తరాంధ్ర లయన్స్ ఓపెనర్ కెప్టెన్ భరత్(4), అతని స్థానంలో వచ్చిన రోహిత్ డకౌట్‌గా అయ్యారు. ఓపెనర్ గుల్ఫామ్(29)కు రాహుల్ తోడై మూడో వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యం అందించాడు. రాహుల్(33), తపస్వి(10) అజేయంగా నిలిచి 13.4 ఓవర్లలోనే 79 పరుగుల చేసి జట్టుకు విజయాన్నందించారు. మల్లికార్జున రెండు వికెట్లు, కమిల్ ఓ వికెట్ తీశాడు.

ప్లేఆఫ్‌కు వీరే...

లీగ్ చివరి మ్యాచ్ ఏడు వికెట్ల తేడాతో పరాజయం పాలైన గోదావరి టైటాన్స్ ప్లే ఆఫ్ అవకాశాన్ని కోల్పోయింది. 16 పాయింట్లతో కోస్టల్ రైడర్స్ ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఉత్తరాంధ్ర లయన్స్, రాయలసీమ కింగ్స్ జట్లు 12 పాయింట్లు సాధించగా.. మెరుగైన రన్ రేట్‌తో లయన్స్ రెండో స్థానంలో నిలిచింది. బెజవాడ టైగర్స్, గోదావరి టైటాన్స్ ఎనిమిదేసి పాయింట్లతో నిలిచినా మెరుగైన రన్‌రేట్‌తో టైగర్స్ ప్లేఆఫ్‌కు అర్హత సాధించారు. దీంతో ఎలిమినేటర్ మ్యాచ్‌లో కింగ్స్‌తో టైగర్స్ తలపడనుండగా క్వాలిఫైయిర్ వన్‌లో రైడర్స్‌తో లయన్స్ తలపడనుంది. వైజాగ్ వారియర్స్ నాలుగు పాయింట్లతో రెండో సీజన్ ముగించింది.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి



కోలా గురువులును అభినందిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

- పార్టీలో ప్రతి ఒక్కరికీ గుర్తింపు
- దక్షిణలో వాసుపల్లి గెలుపు ఖాయం
- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

డాబాగార్డెన్స్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడినవారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. డీసీసీబీ చైర్మన్‌గా, వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన కోలా గురువులకు బుధవారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అభినందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్ సమీపంలో గల అంకోశా గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ బీసీల పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. అందుకే బడుగు, బలహీన వర్గాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అనేక సంక్షేమ ఫలాలు అందివ్వడమే గాక, చట్టసభల్లో అడుగు పెట్టేందుకు అవకాశాలు కల్పించారన్నారు. మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని రాజ్యసభకు పంపిన విషయాన్ని గుర్తుచేశారు. విశాఖ జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కోలా గురువులు మాట్లాడుతూ ఈ సన్మానం తనది కాదు.. మీ అందరిదని అన్నారు. నాకు పెద్ద బాధ్యత అప్పగించారని, ఆ బాధ్యత నెరవేర్చడంలో అందరూ సహకరించాలని కోరారు. 2009 నుంచి నియోజకవర్గమంతా తిరిగానని, ప్రతి ఒక్క కార్యకర్త తనకు తెలుసునని చెప్పారు. అందరూ ఐక్యంగా పనిచేసి వాసుపల్లి గణేష్‌కుమార్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలు జగన్‌మోహన్‌రెడ్డిపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని, తిప్పికొట్టాలన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కష్టపడే ప్రతి ఒక్కరికీ గౌరవం దక్కుతుందన్నారు. ప్రభుత్వ విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ బీసీలకు అధిక ప్రాధాన్యం కల్పించిన పార్టీ వైఎస్సార్ సీపీయేనన్నారు. మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ మాట్లాడుతూ చంద్రబాబును నమ్మే పరిస్థితిలో రాష్ట్ర ప్రజలు లేరన్నారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ మాట్లాడుతూ ఐదు వేళ్లు నోటిలోకి వెళ్తేనే కడుపు నిండుతుందని.. అలాగే అందరూ కష్టపడి పనిచేయాలన్నారు. సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ద్రోణంరాజు శ్రీవత్సవ్ మాట్లాడుతూ పార్టీ అభీష్టం మేరకు ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ మాట్లాడుతూ సామాన్యుడ్ని చట్టసభల్లోకి పంపిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ వీసం రామకృష్ణ, కార్పొరేటర్లు ఉరుకుటి నారాయణరావు, కోడూరు అప్పలరత్నం, బిపిన్‌కుమార్‌జైన్, తోట పద్మావతి, విల్లూరి భాస్కరరావు, మాసిపోగు మేరీజోన్స్, చెన్నా జానకీరామ్, కోడిగుడ్ల పూర్ణిమ, ఆళ్ల లీలావతి, ఎస్‌కేఎమ్‌ఎల్ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, పలు వార్డుల అధ్యక్షులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా కట్టడికి చర్యలు

- చెక్‌పోస్టులు వద్ద నిఘా పెంచాలి
- సమీక్షలో కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: జిల్లాలో గంజాయి లభించకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బోర్డు అధికారులకు సూచించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీలు, స్కూళ్లలో కమిటీలు ఏర్పాటు చేసి గంజాయి, డ్రగ్స్ వల్ల దుష్పరిణామాలను విద్యార్థులకు తెలియజేసి అవగాహన కలిగించాలన్నారు. ఆ కమిటీల్లో శిక్షణ పొందిన ఎన్‌జీవో ప్రతినిధులను సభ్యులుగా నియమించి వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. గంజాయి వినియోగానికి అలవాటుపడ్డ వ్యక్తులను డీ – అడిక్షన్ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. జిల్లాలో గంజాయి రవాణా చేయకుండా అన్ని మార్గాల్లో అవసరమైన స్థాయిలో నిఘా పెంచాలన్నారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కోసం నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాలు, పలు కొరియర్ సంస్థల ద్వారా గంజాయి రవాణాను శతశాతం అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా సంస్థల ప్రతినిధులతో మాట్లాడి రవాణాకు సహకరిస్తే ఎదురయ్యే పరిణామాలను తెలియజేయాలన్నారు. ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా గంజాయి రవాణా అరికట్టడానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా బోట్స్ ద్వారా రవాణా అరికట్టడానికి మెరైన్ పోలీస్, ఫిషరీస్ శాఖలతో చర్చించి వారి సహకారాన్ని పొందాలన్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో రాత్రి వేళల్లో గంజాయికి అలవాటు పడినవారు సంచరిస్తున్నారని, ఆయా ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు, పెట్రోలింగ్ పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎస్ఈబీ ఏఎస్పీ బి.శ్రీనివాసరావు, ఏడీసీపీ (క్రైం) డి.గంగాధరం, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, డీఈవో చంద్రకళ, డ్రగ్ కంట్రోల్ ఏడీ, కేజీహెచ్ సైకియాట్రిక్ నిపుణులు, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్

వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.45,274 కోట్లు

జిల్లా వార్షిక రుణ ప్రణాళిక 2023–24ను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున విడుదల చేశారు. కలెక్టర్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా రుణ ప్రణాళిక మొదటి త్రైమాసిక అమలు, సాధించిన ప్రగతిపై బ్యాంకర్లతో సమీక్షించారు. వార్షిక ప్రణాళికలో భాగంగా ప్రాధాన్య రంగాలకు 15,046 కోట్లు, అప్రాధాన్యత రంగాలకు 30,228 కోట్లు లక్ష్యంగా నిర్ణయించారు. టిడ్కో హౌసింగ్ రుణాల మంజూరు వేగవంతం చేయాలన్నారు. ఎంఎస్ఎంఈ రుణాల మంజూరులో జిల్లా ముందంజలో ఉండాలని, దీనిపై పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ చొరవ చూపాలన్నారు. జిల్లాలో అవసరమైన ప్రాంతాల్లో బ్యాంకులు తమ శాఖలను విస్తరించాలన్నారు. ఆర్బీఐ నిర్వహించిన క్విజ్ పోటీల్లో జోనల్ స్థాయికి ఎంపికైన జెడ్పీ హెచ్ఎస్ చిటివలస విద్యార్థులను అభినందించారు. లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మొదటి త్రైమాసికంలో 59 శాతం మేర ప్రగతి సాధించామన్నారు. ఆర్బీఐ ఎల్‌డీవో పూర్ణిమా, అధికారులు పాల్గొన్నారు.

టంగుటూరి జీవితం ఆదర్శప్రాయం







సెంట్రల్ పార్కులో మేయర్ హరివెంకటకుమారి, కమిషనరేట్ కార్యాలయంలో సీపీ త్రివిక్రమ్ వర్మ, కలెక్టరేట్‌లో కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్ తదితరులు టంగుటూరికి నివాళి అర్పించారు.

మహారాణిపేట/దొండపర్తి/సీతమ్మధార: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతిని పురస్కరించుకొని కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు కడు పేదరికంలో పుట్టినప్పటికి పట్టుదలతో ఉన్నత స్థాయికి చేరారన్నారు. మహోన్నత ఆశయాలతో జీవితాన్ని కొనసాగించినట్టు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, పరిపాలన అధికారి ఈశ్వరరావు, సమాచార శాఖ డీడీ వి.మణిరామ్, డీఈవో చంద్రకళ, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో ఆచార్య సీఆర్ రావు సంస్మరణ సభ

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సాంఖ్యాకశాస్త్ర విభాగంలో బుధవారం ఆచార్య సి.ఆర్ రావు సంస్మరణ సభ జరిగింది. ఆయన చిత్రపటానికి పలువురు ఆచార్యులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆచార్య సి.ఆర్.రావు సాధించిన ప్రగతిని విభాగాధిపతి ఆచార్య బి.మునిస్వామి విద్యార్థులకు వివరించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్, స్టాటిస్టిక్స్ విభాగం సీనియర్ ఆచార్యుడు ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావులు సి.ఆర్.రావుతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. 2010లో 15 రోజుల పాటు ఆయన ఏయూలో లెక్చర్స్ నిర్వహించారన్నారు. ఆచార్య జి.వి.రవీంద్రనాథ్ బాబు, మాజీ రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాదరావు, ఆచార్య ప్రసాద్ బాబు, మ్యాథ్‌మెటిక్స్ విభాగాధిపతి ఆచార్య జి. నానాజీ రావు, అనువర్తిత గణితశాస్త్ర విభాగాధిపతి ఆచార్య కె.రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సి.ఆర్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆచార్యులు

వైద్యులు, సిబ్బంది నియామకానికి చర్యలు

- ఉమ్మడి విశాఖలో నేటి నుంచి కౌన్సెలింగ్
- సెప్టెంబర్ 1 నాటికి అన్ని కేంద్రాల్లో పూర్తి స్థాయిలో సిబ్బంది

మహారాణిపేట: ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇచ్చే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇప్పటికే కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ)ను నాడు – నేడు నిధులతో తీర్చిదిద్దారు. విశాఖలో 8 పీహెచ్‌సీలు ఉన్నాయి. ఒక్కో కేంద్రంలో ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులతోపాటు మొత్తం 14 మంది సిబ్బంది ఉండే విధంగా చర్యలు చేపడుతున్నారు. ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మాసిస్టు, ఒక సీహెచ్‌వో/ఎంపీహెచ్ఈవో, ఒక హెల్త్ ఎడ్యుకేటర్/పీహెచ్ఎన్, ఎంపీహెచ్ఎస్(ఎఫ్), ఒక ఎంపీహెచ్ఎస్ (ఎం), ఎల్‌డీ కంప్యూటర్/జూనియర్ అసిస్టెంటు/సీనియర్ అసిస్టెంటు, ఒక ఎఫ్ఎన్‌వో, ఒక శానిటరీ అటెండర్ కమ్ వాచ్‌మెన్ ఉంటారు. ప్రస్తుతం వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న వారిని ఇప్పుడు పీహెచ్‌సీల్లో నియమిస్తున్నారు. సెప్టెంబర్ 1 నాటికి అన్ని పీహెచ్‌సీల్లో 14 మంది చొప్పున సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. ఒకవేళ సిబ్బంది లేనిపక్షంలో రీ ఫిక్సింగ్ ద్వారా నియమించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

నేటి నుంచి కౌన్సెలింగ్.. పోస్టింగ్

ఉమ్మడి విశాఖ జిల్లాలో సిబ్బంది రీఫిక్సింగ్ కోసం గురువారం నుంచి కౌన్సెలింగ్ చేపట్టనున్నారు. ఈ నెల 24, 26, 28న సిబ్బందికి కౌన్సెలింగ్ నిర్వహించి పీహెచ్‌సీల్లో నియమించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు, వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమాసుందరి చర్యలు చేపట్టారు. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం పార్వతీపురం జిల్లా, విశాఖపట్నం, అనకాపల్లి, ఏఎస్ఆర్ జిల్లాల్లో మొత్తం 255 పీహెచ్‌సీలు ఉన్నాయి. బదిలీలు, కౌన్సెలింగ్ ప్రక్రియ ఆరు జిల్లాల్లో నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 1 నాటికి పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో 14 మంది సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, బుధవారం నుంచి కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇస్తామని వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమా సుందరి పేర్కొన్నారు.

ధాన్యం సేకరణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

మహారాణిపేట: జిల్లాలో ధాన్యం సేకరణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ప్యాడి ప్రొక్యూర్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం ఉత్పత్తి ఏ స్థాయిలో జరుగుతుందో అంచనా వేసి అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇ–క్రాప్ బుకింగ్, ఇ–కెవైసి తప్పనిసరిగా చేయాలని సూచించారు. దీనికి సంబంధించి డైలీ రిపోర్ట్ తనకు అందజేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి వాటిని వర్గీకరణ చేయాలని అన్నారు. క్లస్టర్ ఆర్‌బీకేల్లో టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సహాయకులు నియామకం చేపట్టాలన్నారు. జిల్లాలో గన్ని బ్యాగులు ఏ మేరకు అవసరం అవుతాయో గుర్తించి నిల్వ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, జిల్లా పౌర సరఫరాల అధికారి జి.సూర్యప్రకాశరావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఐ.రాజేశ్వరి, రవాణా శాఖ అధికారి ఎం.బుచ్చిరాజు, డీసీవో పి.దుర్గాప్రసాద్, అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ పిడివి అప్పలరాజు పాల్గొన్నారు.

వైస్ అడ్మిరల్ రాజేష్‌కు ఘన స్వాగతం

మల్కాపురం: ఈస్టర్న్ నేవల్ కమాండెంట్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ (ఎఫ్ఓసీఐఎన్‌సీ)గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ పశ్చిమ నౌకాదళ కమాండ్ క్యాంప్ కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ఆయనకు నేవల్ అధికారులు ఘన స్వాగతం పలికారు. సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. నౌకాదళ కార్యకలాపాలతో పాటు ఇంట్రా కమాండ్ కో–ఆర్డినేషన్‌కు సంబంధించిన ముఖ్య అంశాలపై ఆయన అధికారులతో చర్చించారు.

గంజాయి నిందితుల అరెస్ట్

తాటిచెట్లపాలెం: గంజాయి స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జీఆర్పీ పోలీసులు అంతర్రాష్ట్ర మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ రాకెట్‌ను ఛేదించి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలివీ.. జీఆర్పీ సీఐ ధనుంజయ నాయుడు నేతృత్వంలో నలుగురు ఎస్ఐలను నాలుగు బృందాలుగా ఏర్పాటు చేసి మంగళవారం రెల్వేస్టేషన్ పరిధిలో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో 46 కిలోల గంజాయితో ఐదుగురు పట్టుబడ్డారు. వీరిని బుధవారం రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి సెల్‌ఫోన్, క్వాలిస్ వాహనం స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో రాష్ట్రానికి చెందిన పోకూరు మహేష్, సమీరుద్దీన్(మధ్యప్రదేశ్),అజయ్ సాహూ(భోపాల్), పింటూ ప్రధాన్(ఒడిశా), మనోజ్ (ఒడిశా)ఉన్నారు. తనిఖీల్లో జీఆర్పీ ఎస్ఐలు బి.అప్పలనాయుడు, టి.కామేశ్వరరావు, వి.బాలాజీరావు, ఎం.మధుసూదన్ సిబ్బందితో పాల్గొన్నారు.